

సాక్షి
పల్నాడు
శుక్రవారం ౹ 4 ౹ అక్టోబర్ ౹ 2024




పులిచింతల ప్రాజెక్టు నీటినిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 31,247 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 26,971 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటి మట్టం గురువారం 588.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,867 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 7837 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 306 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

రజత కవచాలంకృతగా అమ్మవారు దర్శనం



అమరావతి: అమరావతిలోని ప్రసిద్ధ శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రజత కవచాలంకృత అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ ఆధ్వర్యంలో చండీ, రుద్ర హోమాలు, శ్రీచక్రార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ అమ్మవారి అలంకార విశిష్టతను వివరించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దిని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో తొలిరోజు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకారం చేసి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. మెయిన్ బజార్‌లోని సీతాసమేత శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకారం చేశారు.

పిడుగురాళ్లలో 24.2 మి.మీ. అత్యధిక వర్షపాతం



నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24గంటల వ్యవధిలో 14 మండలాల్లో 172.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు సంబంధిత అధికారులు గురువారం తెలిపారు. పిడుగురాళ్లలో అత్యధికంగా 24.2 మిల్లీమీటర్ల పడింది. మాచవరంలో 10.2, బెల్లంకొండలో 9.6, క్రోసూరులో 14.6, సత్తెనపల్లిలో 18.0, రాజుపాలెంలో 11.2, వినుకొండలో 4.2, నూజెండ్లలో 12.4, రొంపిచర్లలో 1.2, నరసరావుపేటలో 12.6, ముప్పాళ్లలో 7.6, నాదెండ్లలో 15.4, చిలకలూరిపేటలో 18.8, యడ్లపాడులో 12.6 మి.మీ. వర్షం కురిసింది. కాగా నరసరావుపేట పట్టణంతో పాటు పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు సాయంత్రానికి వర్షం పడటంతో వాతావరణం చల్లబడి ఉపశమనం లభించింది. విద్యుత్ సరఫరాకు అరగంటకు పైగా అంతరాయం కలిగింది. అయితే, ఎక్కడా ప్రమాద సంఘటనలు జరగ లేదు.

ప్రశాంతంగా టెట్ ప్రారంభం

తొలి రోజు 68మంది గైర్హాజరు

నరసరావుపేట ఈస్ట్: ఏపీ టెట్–2024 పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నాలుగు కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌గా పరీక్ష నిర్వహిస్తున్నారు. తొలి రోజు ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల, ఏఎం రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 517 మంది అభ్యర్థులకు గాను 449 మంది హాజరయ్యారు. 68మంది గైర్హాజరయ్యారు. ఎంఏఎం కళాశాలలో 157 మందికి గాను 128మంది, ఏఎం రెడ్డి కళాశాలలో 360మందికి గాను 321మంది హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల్ని నోడల్ అధికారి ఆర్.ఎస్. గంగాభవాని, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు సందర్శించారు. పరీక్ష నిర్వహణ తీరు, ఏర్పాట్లను పరిశీలించారు.

సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా విడుదలవుతున్న సాగు నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఈ మురళీధర్ సూచించారు. ప్రాజెక్టు ద్వారా విడుదలవుతున్న సాగునీటిని ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. కాలువ గేజ్ రీడింగ్‌ను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు 10,000 క్యూసెక్కులు విడుదల అవుతుండగా గురువారం 500 క్యూసెక్కులు పెంచారు. ఈ సందర్భంగా సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ డీఈ మురళీధర్ మాట్లాడుతూ జలాశయానికి ఎగువ నుంచి వరద నీరు కొనసాగుతుండటంతో కుడి కాలువకు నిరంతరాయంగా విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈ వెంకట సుబ్బయ్య, సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ ఏఈఈ అనితశ్రీ పాల్గొన్నారు.

సేద్యంపై కాలకూటమి విషం

- పల్నాడులో ఖరీఫ్ సాగు అంతంత మాత్రమే
- ఈ ఏడాది సాధారణ సాగు లక్ష్యం 2,48,350 హెక్టార్లు
- సాగైంది మాత్రం 1,73,497 హెక్టార్లు
- పంటలకు గిట్టుబాటు ధరలు, ప్రభుత్వ సాయం లేకపోవడమే ప్రధాన కారణం
- ఇప్పటివరకు రైతు భరోసా నిధుల ఊసెత్తని కూటమి సర్కార్
- గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో 2.81 లక్షల మంది రైతులకు రూ.1,738.58 కోట్లు లబ్ధి



దుర్గి మండలంలో సాగు చేసిన పత్తి పంట

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో ఈ ఏడాది వానలు సమృద్ధిగా కురిశాయి. లక్షలాది ఎకరాలకు సాగునీరు అందింది. నాగార్జున సాగర్‌లో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. ఆగస్టు తొలి వారంలోనే క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని కిందకు వదిలారు. దీంతో పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు పూర్తిస్థాయిలో ఉంటుందని రైతులంతా ఆశించారు. అయితే, జిల్లాలో సాధారణ సాగు లక్ష్యంలో 70 శాతం మాత్రమే పూర్తయ్యింది. ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు లక్ష్యం 2,48,350 హెక్టార్లు కాగా ప్రస్తుతానికి సాగైంది 1,73,497 హెక్టార్లే. ఖరీఫ్ కాలమైన జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణ వర్షపాతం 486.2 మి.మీ. కాగా జిల్లాలో 590.4 మి.మీ. నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం కన్నా 21.4 శాతం అధికం. సాగర్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం 312 టీఎంసీలు కాగా గురువారం సాయంత్రం 6 గంటలకు 307 టీఎంసీలు నిల్వ ఉంది. అయినా సాగు అనుకున్నంత లక్ష్యాన్ని చేరుకోలేదు. దీనికి కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం, పంటలకు గిట్టుబాట ధర కల్పించకపోవడమే ప్రధాన కారణం.

తగ్గిన సాగు విస్తీర్ణం

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. పత్తి పంట కేవలం 61 శాతమే సాగైంది. సాధారణ సాగు 1,07,186 హెక్టార్లు కాకగా సాగైంది కేవలం 65,317 హెక్టార్లే. దీనికి సాగు ఖర్చు పెరగడం, పంటలకు చీడపీడల ప్రభావం అధికంగా ఉండటం, గిట్టుబాటు ధర లేకపోవడంగా చెప్పుకోవచ్చు. మరోవైపు మిర్చి సాధారణ లక్ష్యం 58,202 హెక్టార్లుకాగా 39,609 హెక్టార్లలోనే సాగైంది. సాగర్ కాలువలకు నీరు విడుదలపై ప్రభుత్వ ప్రకటన ఆలస్యం కావడంతో రైతులు నారు ఆలస్యంగా పోశారు. దీంతో ఇంకా కొంత మంది రైతులు పంట సాగుచేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు.

వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు అందిన నిధులు

సంవత్సరం	రైతుల సంఖ్య	నిధులు (రూ.కోట్లలో)
2019-20	2,41,515	326.04
2020-21	2,50,469	338.13
2021-22	2,48,812	335.90
2022-23	2,66,871	360.27
2023-24	2,80,181	378.24

నియోజకవర్గాల వారీగా రూ.20 వేల కోసం ఎదురుచూస్తున్న రైతుల సంఖ్య

నియోజకవర్గం	రైతుల సంఖ్య
నరసరావుపేట	25,682
చిలకలూరిపేట	27,594
సత్తెనపల్లి	42,516
పెదకూరపాడు	47,255
గురజాల	42,202
మాచర్ల	46,422
వినుకొండ	48,510
మొత్తం	2,80,181

ఆర్థిక సహాయం ఎక్కడ...?

టీడీపీ ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టో అబద్ధాల పుట్ట. ప్రతి రైతుకు ఏటా పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించింది. దీని ద్వారా జిల్లాలో ఉన్న 2,80,181 మంది రైతులకు ఏటా రూ.560.36 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో ఖరీఫ్ సాగుకు రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. చేతిలో చిల్లి గవ్వ లేదు. ఈ ప్రభావం ఖరీఫ్ సాగుపై పడి కేవలం 70 శాతమే సాగైందన్న అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతోంది. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఏటా వైఎస్సార్ రైతుభరోసా నిధులు అందజేశారు. పల్నాడు జిల్లాలో ఐదేళ్లలో ఏకంగా రూ.1,738.58 కోట్లను నేరుగా రైతుల ఖాతాలలో జమ చేశారు.

పత్తి పంట సాగు బాగా తగ్గింది



జిల్లాలో పత్తి పంట ఈ ఖరీఫ్‌లో బాగా తగ్గింది. దానికి ప్రధాన కారణం సాగుకు పెట్టుబడి పెరగడంతో పాటు చీడపీడలు అధికంగా ఉండటంతో దిగుబడి రాను రాను తగ్గిపోతోంది. మరోవైపు పత్తి ధర తక్కువగా ఉండే అవకాశం ఉండటంతో రైతులకు గిట్టుబాటు అయ్యేలా కనిపించడం లేదు. ఈ కారణంతో సాగు బాగా తగ్గింది. మరోవైపు మిర్చి సాగు అనుకున్న దానికన్నా ఆలస్యంగా మొదలైంది. ఇంకా కొంత మంది సాగు చేసే ఆలోచనలో ఉన్నారు. మిగిలిన రైతులు రబీలో అపరాల సాగు చేయనున్నారు.

– ఐ మురళీ, పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పిడుగుపాటుకు బీటెక్ విద్యార్థిని మృతి

చీరాల: పిడుగుపాటుకు బీటెక్ విద్యార్థిని మృతి చెందిన సంఘటన బాపట్ల జిల్లా చీరాల రూరల్ మండలంలోని పాతచీరాలలో గురువారం చోటుచేసుకుంది. బాపట్లలోని నరాల శెట్టివారిపాలేనికి చెందిన కారు డ్రైవర్ నూతక్కి వెంకటేశ్వర్లు, పార్వతి దంపతుల కుమార్తె తులసి (19) బాపట్లలోని ఎన్టీఆర్ ఫుడ్ టెక్నాలజీ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులు ఇవ్వడంతో గత నెల 30న పాతచీరాలలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. గురువారం ఉదయం వర్షం కురుస్తున్న సమయంలో డాబాపై ఉన్న దుస్తులు తీసేందుకు వెళ్లింది. ఒక్కసారిగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందింది. డాబాపైకి వెళ్లిన యువతి కిందకు రాకపోవడంతో పైకి వెళ్లి చూడగా విషయం వెలుగుచూసింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు.. ఒక్కగానొక్క కూతురు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

యార్డుకు 54,870 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 54,870 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 53,641 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల ధర రూ.9,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 9,000 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 26,718 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి తెలిపారు.

గుంటూరు డివిజన్‌పై వరాలు కురిసేనా ?



- నేడు రైల్వే జీఎం సమావేశం
- ఎంపీ అయోధ్య రామిరెడ్డి పలు విజ్ఞప్తులు
- గుంటూరు శంకర్ విలాస్ వద్ద ఆర్‌ఓబీకి ప్రతిపాదన
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కూడా వినతులు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే జీఎం ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు, గుంతకల్లు, విజయవాడ డివిజన్‌ల పరిధిలోని పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులతో ప్రత్యేక సమావేశం జరగనుంది. గుంటూరు డివిజన్‌కు సంబంధించిన పార్లమెంట్, రాజ్యసభ సభ్యులు ఇప్పటికే పలు ప్రతిపాదనలు చేశారు. ఇందులో డివిజన్‌పై ఎన్ని వరాలు కురుస్తాయో వేచి చూడాలి.

ఎంపీ అయోధ్య రామిరెడ్డి విజ్ఞప్తులు ఇలా..

డివిజన్ పరిధిలోని గుంటూరు నగర వాసులు ట్రాఫిక్ సమస్యలతో దీర్ఘకాలంగా సతమతం అవుతున్నారు. ఈ క్రమంలో గుంటూరు శంకర్ విలాస్ వద్ద కొత్త రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) ప్రతిపాదన చేశారు. ట్రాఫిక్ రద్దీ సమయంలో ఆర్‌ఓబీ దాటడానికి సుమారు 30 నిమిషాల సమయం పడుతుందని తెలిపారు. ప్రసుత్తం ఉన్న ఇరుకైన రెండు లైన్‌ల వంతెన స్థానంలో ఆరు లైన్‌లతో కొత్తదాన్ని నిర్మించాలని ప్రతిపాదించారు.

- ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణం చేపట్టాలని కోరారు.
- శ్యామలానగర్, సంజీవయ్యనగర్, నెహ్రూనగర్ , మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని ఎన్‌హెచ్–5 కొలనుకొండ వద్ద , ప్రధానంగా భ్రమరాంబ మల్లేశ్వరి స్వామి దేవాలయం ఉన్నందున పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పెదకాకానిలో ఆర్‌ఓబీలు నిర్మించాలని కోరారు. గ్రామంలో బాజీ బాబా దర్గా, కాకాని స్వస్తిశాల (తోట) వద్ద రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల గ్రామస్తులతో పాటు భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైల్వే లెవల్ క్రాసింగ్ స్థానంలో ఆర్‌యూబీ నిర్మాణం ప్రతిపాదించారు.
- చిలకలూరిపేట అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో గుంటూరు– సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(రైలు నంబర్ 12705–12706)కు అనవేమ ఎక్స్‌ప్రెస్‌గా పేరు పెట్టాల్సిందిగా కోరారు. కొండవీడు రెడ్డి రాజులలో గొప్పవాడైన అనవేమ రాజు అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కాబట్టి ఈ రైళ్లకు అనవేమ ఎక్స్‌ప్రెస్‌గా పేరు పెట్టాల్సిందిగా కోరారు.
- జగ్గయ్యపేట అసెంబ్లీ పరిధిలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట రైల్వే స్టేషన్‌కు ప్యాసింజర్ మంజూరు చేయాలని విన్నవించారు.

నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ప్రతిపాదనలు

- అమృత్ భారత్ స్టేషన్ పథకం ఆధునీకరణ ప్రాజెక్టు కింద నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల, నడికుడి రైల్వేస్టేషన్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.
- కొత్త నడికుడి–శ్రీకాళహస్తి రైలు ప్రాజెక్టు పల్నాడు, ప్రకాశం జిల్లా కరువు ప్రాంత వాసులకు ఉపయోగకరంగా ఉంటుంది.
- పల్నాడు జిల్లాలోని రైల్వే స్టేషన్‌లలో తాగునీరు, పార్కింగ్ సౌకర్యాలు, ప్లాట్‌ఫారం షెడ్‌ల విస్తరణ, చెట్ల పెంపకం, వాష్ రూమ్ సౌకర్యాలు, రోడ్ల కనెక్టివిటీ, అదనపు వాటర్ కూలర్ ఏర్పాటు వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రతిపాదించారు.
- నూతన లైన్‌లలో నడికుడి–శ్రీకాళహస్తి, మాచర్ల–గద్వాల్, మాచర్ల–విజయవాడ మధ్య కొత్త రైళ్లు వేయాలి.
- గుంటూరు జంక్షన్–న్యూఢిల్లీ మధ్య కొత్త రైలు వేయాలి.
- శబరి ఎక్స్‌ప్రెస్ నరసరావు పేట మీదుగా, గుంటూరు జంక్షన్, నంద్యాల మధ్య కొత్త రైలు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ప్రతిపాదించారు.
- ఎంఎంటీఎస్ రైలు సేవలు పేరేచర్ల–గన్నవరం–పెద్ద ఔటుపల్లితో పాటు పల్నాడు జిల్లా పరిధిలోని పలు ప్రతిపాదనలు చేశారు.
- గుంటూరు కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సైతం రైల్వే డీఆర్‌ఎంకు ప్రతిపాదనలు పంపించారు. శుక్రవారం జరిగే రైల్వే జీఎం సమావేశంలో ఎంపీలు, రాజ్యసభ సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలు ఎంత వరకు మంజూరు చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

'అమృత్' పనులను సకాలంలో పూర్తి చేయండి

శాసనసభ్యులు, అధికారుల సమీక్షలో కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అమృత్ ఫేజ్–1, ఫేజ్–2 పనుల్ని పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం అమృత్ పథకంపై ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఫేజ్ వన్ కింద రూ.13.53 కోట్లతో చేపట్టిన పనులు 99శాతం, చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సరఫరాకు 8.82 కోట్లతో చేపట్టిన పనులు 94 శాతం పూర్తయ్యాయని చెప్పారు. నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో ఫేజ్–2 కింద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, సరఫరాకు సంబంధించి రూ.153 కోట్లతో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు శాసనసభ్యులు తమ నియోజకవర్గాల్లో జరుగుతున్న పనుల్ని దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జి.వి.ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ ఏ.శ్రీనివాస రెడ్డి, సీపీవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర అభివృద్ధికి సూచనలివ్వండి

స్వర్ణాంధ్ర–2047లో భాగంగా జిల్లాలో ఏడాదికి 15శాతం వృద్ధి రేటు సాధించేందుకు కావాల్సిన సూచనలు, సలహాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చాంబర్ ఆఫ్ కామర్స్, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో జిల్లాలో పేదరిక నిర్మూలన, వృద్ధి రేటుకు సంబంధించి మండల, జిల్లా స్థాయి ప్రణాళికలు రూపొందించేందుకు అవసరమైన సూచనలు, సలహాలివ్వాలని తెలిపారు. రాష్ట్రంలో జిల్లాకు మంచి స్థానం లభించేలా సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శక్తి స్వరూపం

అభయహస్తం



అమ్మవారిని ఊరేగింపుగా మహా మండపానికి తీసుకెళుతున్న దృశ్యం

- తొలి దర్శనం చేసుకున్న మంత్రులు, సీపీ, ఈవో
- నేడు గాయత్రీదేవిగా దర్శనమివ్వనున్న దుర్గమ్మ
- తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులకు అనుమతి
- తొలిరోజే సేవా కమిటీ పేరుతో హడావుడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో దసరా మహోత్సవాలు గురువారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు దుర్గమ్మ శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము అమ్మవారికి స్నపనాభిషేకం, అలంకరణ, నిత్య పూజలు నిర్వహించారు. నిత్య పూజల అనంతరం ఉదయం 8.40 గంటలకు తొలి దర్శనానికి అనుమతించారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, సీపీ రాజశేఖరబాబు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావులతో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు అమ్మవారిని తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం రూ. 500 వీఐపీ క్యూలైన్‌తో పాటు రూ. 100, రూ.300, సర్వ దర్శనంలో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. .

అమ్మ ఆగమనం.. ఆనంద పరవశం..

దుర్గమ్మ ఉత్సవ మూర్తికి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై మహా మండపం ఆరో అంతస్తుకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. వేదికపై అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గణపతి పూజలో ఈవో కేఎస్ రామారావు దంపతులు పాల్గొన్నారు.

కుంకుమార్చనలు..

ఆలయ ప్రాంగణంలోని మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. పూజ అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

అమ్మవారికి రూ. 4 కోట్ల వజ్రాభరణాల బహూకరణ

మహారాష్ట్ర పూణేకు చెందిన వ్యాపారవేత్త సౌరభ్ గౌర్ వజ్ర కిరీటాన్ని సమర్పించగా, సీఎం రాజేష్ సూర్య, చంద్ర ఆభరణాలను.. ముక్కెర, నత్తు, బుల్లాకిని సూర్యకుమారి అమ్మవారికి సమర్పించారు. ఆశీర్వచన మండపంలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో రత్నరాజు, ఆలయ ఈవో రామారావు చేతుల మీదుగా అర్చకులకు అందజేశారు.

దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున అమ్మవారికి శ్రీగాయత్రీదేవిగా అలంకరణ
- తెల్లవారుజామున 4 గంటల నుంచి దర్శనం
- తెల్లవారుజామున 5 గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7 గంటలకు, 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- ఉదయం 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన
- ఉదయం 10 గంటలకు ప్రత్యేక చండీహోమం
- సాయంత్రం 6 గంటలకు మహా మండపం నుంచి నగరోత్సవ సేవ
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

క్లుప్తంగా

అమరావతిలో విజయ్ డిజిటల్స్ షోరూం ప్రారంభం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి మెయిన్ రోడ్డులో గురువారం ఎలక్ట్రానిక్ గృహోపకరణాల షోరూం విజయ్ డిజిటల్స్‌ను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్ డిజిటల్స్ వ్యవస్థాపకుడు జవ్వాది గంగాధరరావు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ గృహోపకరణాల విక్రయంలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో అనేక షోరూంలలో వినియోగదారులకు నలభై ఏళ్లుగాఉత్తమ సేవలు అందిస్తున్నామని తెలిపారు. దసరా, దీపావళి పండుగలకు అన్నిరకాల గృహోపకరాలపై ప్రత్యేక డిస్కౌంట్‌తో పాటు సరసమైన ధరలకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఉషాకిరణ్, రాహుల్, జయశ్రీ తో పాటు స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్‌సెంటర్‌కు లైసెన్స్ మంజూరు

నరసరావుపేట: స్థానిక లింగంగుంట్లలోని 200 పడకల ప్రభుత్వ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌కు డ్రగ్స్ అండ్ కాపీరైట్స్, డ్రగ్స్ కంట్రోలర్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ఇండియా నుంచి లైసెన్స్ మంజూరైందని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం బ్లడ్ సెంటర్‌ను గవర్నమెంట్ హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చాలా అధునాతనమైన పరికరాలు, కాంపోనెంట్స్‌తో కూడిన బ్లడ్ సెంటర్‌ను రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేశారని, త్వరలో ప్రారంభిస్తామని, దానికి కావలసిన సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. వైస్ చైర్మన్ పీవీఎం శరత్ బాబు, కోశాధికారి గంధ్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ రెహమతుల్లా పాల్గొన్నారు.

యానాదులు అన్ని రంగాల్లో రాణించాలి

వేటపాలెం: యానాదులు అన్ని రంగాల్లో రాణించాలని ఫిషరీస్ ఏడీ కృష్ణకిషోర్ పేర్కొన్నారు. రామన్నపేట పంచాయతీ పార్వతీపురం కాలనీలో యానాది మత్స్యకార సొసైటీ ఏర్పాటు, వారి సమస్యలపై అవగాహన సమావేశం గురువారం నిర్వహించారు. ఏడీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. యానాదులు ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. పిల్లలను చదివించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం మత్స్యకార సొసైటీ ఏర్పాటు గురించి వివరించారు. చీరాల, వేటపాలెం ప్రాంతాల్లో రెండు మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఎఫ్‌డీఓ రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు చేవూరి నాగబాబు, డైరెక్టర్ రాపూరి సుబ్బారావు, కొమరగిరి వెంకట ప్రసాద్, వేటగిరి సంజీవరావు, గండ్లళ్ల నరేష్ పాల్గొన్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు





దసరాకు విద్యా సంస్థలు గురువారం నుంచి సెలవులు ప్రకటించటంతో స్వస్థలాలకు వెళ్లడానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున బస్టాండుకు వచ్చారు. దీంతో రద్దీ నెలకొంది. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు 86 ప్రత్యేక సర్వీసులను హైదరాబాద్ నుంచి నడపనున్నారు. చెన్నై, వైజాగ్, బెంగళూరుకు రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఎం. రవికాంత్ తెలిపారు. గుంటూరు - మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రి మధ్య నిత్యం బస్సులు నడపనున్నట్లు చెప్పారు. ఈ నెల 5, 6వ తేదీల్లో సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ నేపథ్యంలో విద్యార్థులు, ఇతర అన్ని రకాల బస్‌పాస్‌ల కౌంటర్లు పనిచేయవని తెలిపారు.

–పట్నంబజారు

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్య

- గుండె పోటుగా చిత్రీకరించే ప్రయత్నం
- కేసును చేధించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీఐ నఫీజ్‌బాషా



విలేకరులతో మాట్లాడుతున్న మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, ఎస్‌ఐ మహమ్మద్ షఫి

విజయపురిసౌత్: వ్యక్తి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు చేధించారు. భార్య, ప్రియుడు కలసి భర్తను హత్య చేసినట్లు విచారణలో తేలింది. గురువారం విజయపురిసౌత్‌లోని పోలీస్ స్టేషన్‌లో మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ తెలంగాణ నల్గొండ టౌన్‌కు చెందిన ఓర్సు శివయ్యకు మాచర్ల మండలం తాళ్లపల్లికి గాయత్రితో ఆరేళ్ల కిందట వివాహం అయింది. పెళ్లి తరువాత స్థానిక పవర్ గ్రిడ్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా చేరాడు. వీరికి ఇద్దరు బాలికలు. భార్యకు తాళ్లపల్లికి చెందిన గ్రామ సచివాలయ ఉద్యోగి అమ్మోరయ్యతో వివాహం కాకముందే సాన్నిహిత్యం ఉంది. గాయత్రి, అమ్మోరయ్య పెళ్లి చేసుకుందాం అనుకున్నా పెద్దలు అంగీకరించకపోవడంతో గాయత్రి పెద్దలు నిర్ణయం మేరకు వివాహం చేసుకుంది. గత నెల 30న అర్ధరాత్రి సమయంలో భర్త ఇంట్లో నిద్రిస్తుండగా ఆ సమయంలో అమ్మోరయ్య గాయత్రి దగ్గరికి వచ్చాడు. ఇద్దరూ కలసి ఏకాంతంగా గడుపుతున్న సమయంలో భర్త శివయ్య నిద్ర లేవటంతో ఆయన కంట పడ్డారు. శివయ్య ఇద్దరితో గొడవ పడటంతో కంగారుపడ్డ గాయత్రి, అమ్మోరయ్య దిండును మొహంపై అదిమి శివయ్యను చంపేసినట్లు విచారణలో అంగీకరించారు. గుండెపోటుతో చనిపోయాడని చెప్పి నమ్మించేందుకు ప్రయత్నించారు. అనుమానం వచ్చిన మృతుడి తల్లి విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విజయపురిసౌత్ ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేసి చాకచక్యంగా వ్యవహరించి నిందితుల నుంచి అసలు విషయం రాబట్టాడు. దీంతో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. శివయ్యను హత్య చేసిన గాయత్రి, అమ్మోరయ్యలను కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ సోమ్లా నాయక్ ఉన్నారు.

జీజీహెచ్ కమిటీ నిపుణులకు టెండర్ల 'పరీక్ష'

ల్యాబ్ కాంట్రాక్టు ఖరారుకు ప్రజాప్రతినిధుల సిఫార్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందే రోగులకు ఇక్కడ అందుబాటులో లేని వైద్య పరీక్షలు (బ్లడ్ టెస్టులు) బయట ప్రైవేటు ల్యాబ్‌లతో చేయించేందుకు గత నెలలో టెండర్లు పిలిచారు. గురువారం ల్యాబ్‌లు ఖరారు చేసే జీజీహెచ్ కమిటీ నిపుణులు టెండర్లు ఓపెన్ చేశారు. తొమ్మిది ల్యాబ్‌లు ఆసక్తి చూపాయి. ఏడాదిపాటు కాంట్రాక్టును టెండరు ద్వారా అప్పగించి, పనితీరు బాగుంటే మరో ఏడాది కొనసాగిస్తారు.

సిఫార్సులతో తలనొప్పులు

టెండర్లకు ఆసుపత్రి 15 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికంగా తొమ్మిది మంది టెండరు ప్రక్రియలో పాల్గొన్నారు. వీరిలో ప్రతి ఒక్కరూ ఎవరో ఒక ప్రజాప్రతినిధితో ఆసుపత్రి అధికారులకు ఫోన్ చేయించినవారే. టెండరు ఇవ్వాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. మంత్రి నారా లోకేష్ కార్యాలయం, స్పీకర్ కార్యాలయం, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, మరో ముగ్గురు మంత్రుల కార్యాలయాల నుంచి నెల రోజులుగా ఈ ఫోన్లు వస్తున్నాయి. వాస్తవానికి టెండర్లు పరిశీలించి ల్యాబ్‌ను ఆసుపత్రిలోని నిపుణుల కమిటీ ఖరారు చేస్తుంది. ప్రజాప్రతినిధుల సిఫార్సులు రావడంతో జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకుని టెండరు ఖరారు చేసేందుకు జీజీహెచ్ అధికారులు సిద్ధమైనట్లు సమాచారం.

బిల్లులు రాకున్నా పోటీలోనే..

గతంలో నాలుగేళ్లపాటు ఆసుపత్రిలో ల్యాబ్ టెస్టుల కాంట్రాక్టు దక్కించుకున్న మెడ్ ఐకాన్ ల్యాబ్ నిర్వాహకుడు సురేష్ తనకు రూ.కోటికిపైగా బకాయిలు రావాల్సి ఉందని చెప్పారు. మూడేళ్లుగా ఆస్పత్రి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ల్యాబ్ టెస్టుల కాంట్రాక్టు తీసుకున్న గ్లోబల్ ల్యాబ్ నిర్వాహకుడు వెంకట లక్ష్మణ్ తనకు రూ. 2.50 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని, వాటిని ఇప్పించండని ప్రజాప్రతినిధుల కార్యాలయాల చుట్టూ, ఆసుపత్రి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. సంవత్సరాల తరబడి ల్యాబ్‌ల నిర్వాహకులకు రూ.కోట్ల నిధులు పెండింగ్‌లో ఉంటున్నప్పటికీ తాజా కాంట్రాక్టు కోసం ఎందుకు పోటీ పడుతున్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

పిడుగురాళ్లరూరల్: రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన తుమ్మలచెరువు రైల్వే గేటు సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులకు తెలిపిన వివరాలు... తుమ్మలచెరువు, నడికుడి రైల్వే స్టేషన్ల మధ్యలో ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందన్న సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించగా సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్యలో తెల్లచొక్కా, లుంగీ ధరించి చనిపోయి ఉన్నాడు. మృతుడికి గతంలో కాలుకి రాడ్డు కూడా వేసినట్లు పోలీసులు చెప్పారు. ఆచూకి తెలిసిన వారు ఎవరైనా ఉంటే నడికుడి రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

అమరావతి రాజధానికి నూతన మార్గాలు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా సహా అనేక ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి వేగంగా చేపడతామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అధికారులతో కలిసి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ అమరావతి రాజధానికి ఉమ్మడి జిల్లాలో ఉన్న రెండు హైవేలను కనెక్ట్ చేసే దిశగా ప్లాన్ రూపొందించామన్నారు. వినుకొండ, గుంటూరు జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించడంతోపాటు మరిన్ని రహదారులు అభివృద్ధి చేస్తున్నామన్నారు. జిల్లాలో అమరావతి కనెక్టివిటీ కోసం ఇప్పటికే నూతన ప్లాన్ సిద్ధమైందని పేర్కొన్నారు. అమరావతి కనెక్టివిటీ నూతన ప్లాన్ ప్రకారం 25 కిలో మీటర్లు పెరుగుతున్నప్పటికీ గుంటూరుకు మరో ఇన్నర్‌రింగ్ రోడ్డుగా ఉపయోగపడుతోందని తెలిపారు. భూసేకరణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చూసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, విజయవాడ, గుంటూరు నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, పార్వతీశం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయాలి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



మాట్లాడుతున్న కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామ పంచాయతీల్లో పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ 2024–25 వార్షిక కార్యాచరణ ప్రణాళికపై డీఎల్‌పీవో, ఎంపీడీవో, ఈవో పీఆర్డీలకు మూడు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ.. ఇందుకు ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా పని చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం ఎంతో కీలకమని, ప్రజల ఆరోగ్యంతోపాటు వారి జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్న అంశమని అన్నారు. జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహించనున్న శిక్షణ తరగతుల్లో సంబంధిత అంశాలపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని సూచించారు. డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా బ్రహ్మారెడ్డి

నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా బార్ కౌన్సిల్ సభ్యులు, గుంటూరుకు చెందిన వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ చైర్మన్ ఎన్.ద్వారకానాథ్‌రెడ్డి నియమాక ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. రాష్ట్రంలోని న్యాయవాదులపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, సాక్షులను విచారించనున్నామని అన్నారు. బాధితుల ఫిర్యాదులకు సంఘం పక్షాన పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. బార్ కౌన్సిల్ సభ్యునిగా కొనసాగినంత వరకు చైర్మన్‌గా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా ది గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు బ్రహ్మారెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి, అభినందించారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు దోపిడీ

పట్నంబజారు: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గుంటూరులోని బూరెలవారి వీధిలో నివాసం ఉండే గుడివాడ ద్రౌపది, ఆమె కుమార్తె జోత్స్న స్టేడియం వైపు నుంచి పాత గుంటూరు నడుచుకుంటూ వస్తున్నారు. ఆ సమయంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని దుండగులు ద్రౌపది మెడలోని బంగారు గొలుసులు లాక్కొని పరారయ్యారు. సుమారు 44 గ్రాముల బంగారం దోచుకెళ్లినట్లు తలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోలు బంకు ఏర్పాటుపై విచారణకు ఆదేశం



గుంటూరు: గుంటూరు జిల్లా తెనాలిలో గ్రీన్ బెల్ట్ రెగ్యులేషన్స్‌ను అతిక్రమించి పెట్రోల్ బంకు నిర్మిస్తున్నారనే ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి విచారణకు ఉత్తర్వులు జారీ చేశారు. తెనాలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా ఏపీఐఐసీకి చెందిన స్థలంలో నయారా ఎనర్జీ కంపెనీ పెట్రోలు బంకును గుమ్మడి ఉష నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ బాపట్ల జిల్లా చుండూరు మండలం పెదగాదెలవర్రు నివాసి కుడితిపూడి వేణుబాబు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి నివేదిక సమర్పించాల్సిందిగా తెనాలి సబ్ కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సదరు పెట్రోలు బంకు నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) నుంచి అనుమతి తీసుకోలేదని, గ్రీన్‌బెల్ట్ కింద కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేశారని, మరోవైపు దారి మూసేశారని, ఇవన్నీ చట్ట విరుద్ధమని వేణుబాబు ఆరోపించారు. ఇదే పెట్రోలు బంకును 2021లో నిర్మించడానికి సిద్ధమవగా.. ముప్పా ధరణికుమారి హైకోర్టులో పిటిషను దాఖలు చేయటంలో రద్దు చేశారని, మళ్లీ ఈ ఏడాది అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకుని నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఇలాంటి అనధికార నిర్మాణానికి బ్యాంకులు కూడా రుణం మంజూరు చేయటం తగదన్నారు. వీటిన్నింటిపై జిల్లా కలెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో వివరించారు. దీంతో విచారించి, తనకు నివేదిక సమర్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

పత్తి కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయండి

జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గనోరే

నరసరావుపేట: జిల్లాలో గుర్తించిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాలో 2024–25 ఏడాదికి ప్రత్తి కొనుగోలు కేంద్రాల ముందస్తు ఏర్పాట్లుకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, ఏఎంసీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఏపీపీలో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని, గుర్తించిన కొనుగోలు కేంద్రాలలో సేఫ్టీ మెజర్స్, వెయిట్ బ్రిడ్జీలు తనిఖీలు చేయాలని, పత్తి కొనుగోళ్ల గురించి జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రచారం చేయాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. రైతులు లూజు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకునివచ్చే విధంగా ప్రోత్సహించాలని కోరారు. జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి కె.సూర్య ప్రకాష్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, అదనపు జిల్లా ఎస్పీ జేవీ సంతోష్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎన్.శివ నాగేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్. శ్రీధర్ పాల్గొన్నారు.

ఇంటికి తాళాలు వేసి వెళ్లేవారు సమాచారం ఇవ్వండి

- ఆన్‌లైన్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా రిజిస్టర్‌చేయండి
- జిల్లా ప్రజలకు సూచించిన ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: దసరా పండుగ సందర్భంగా ఎవరైనా ఇంటికి తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్తుంటే వారి సమాచారాన్ని సంబంధిత పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లేనిపక్షంలో ఏ రోజు నుంచి ఏ రోజు వరకు ఇంటికి తాళం వేసి వెళుతున్నారు.. అనే సమాచారాన్ని లాక్‌డు హౌసింగ్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్‌కు వివరాలు, చిరునామా, సెల్ నెంబర్ ఇచ్చి ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. సదరు వ్యక్తులు ఊరు వెళ్లి వచ్చేంతవరకు సీసీ కెమెరా పర్యవేక్షణలో మీ ఇంటి మీద నిఘా ఉంచబడుతుందన్నారు. తాళం వేసి ఉన్న మీ ఇంటి భద్రత కోసం పోలీస్ వారు అందిస్తున్న ఉచిత సేవను ప్రజలందరూ వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరి మృతి

ఇద్దరి పరిస్థితి విషమం



మృతి చెందిన గోపాల్

పిడుగురాళ్లరూరల్: పొట్ట కూలి కోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకోగా ఇద్దరు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం... పిడుగురాళ్లకు చెందిన గోపాల్(35), మట్టి గోపినాయక్, చల్లా తిరుపతయ్య, మేగావత్ స్వామినాయక్, కృష్ణ, నారాయణ మరి కొంతమంది కూలీలు దాచేపల్లి పట్టణంలో ఓ ఇంటికి శ్లాబ్ వేసేందుకు పనులకు వెళ్లారు. శ్లాబ్ పనులు పూర్తి చేసుకొని, పని సామన్లు అన్ని ట్రాక్టర్‌కు ఎక్కించుకొని తిరిగి వస్తుండగా పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద దాచేపల్లి వైపు నుంచి వెనుక వైపుగా వస్తున్న లారీ ట్రాక్టర్ ఢీకొట్టింది. ట్రాక్టర్‌లో ఉన్న డ్రైవర్‌తో సహా కూలీలు అంతా రోడ్డుపై పడ్డారు. వెంటనే స్థానికులు గాయాలైన వారిని టోల్‌ప్లాజా అంబులెన్స్ సహాయంతో గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే గోపాల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండగా మెరుగైన చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ గోపి మృతి చెందారు. ఇద్దరి మృతదేహాలను గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనా స్థలాన్ని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్థాపించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 4, 5, 6వ తేదీల్లో రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయులకు 15 అంశాలపై క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గురువారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో క్రీడోత్సవాల పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభ సభ జరుగుతుందని చెప్పారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతితిగా హాజరుకానున్నారని వివరించారు. రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సర్ కత్తెర హెనీ క్రిస్టినా, పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. గుంటూరు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం, శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్, పిచ్చుకలగుంట గ్రౌండ్, పోలీస్ గ్రౌండ్, కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీల్లో మూడు రోజుల పాటు క్రీడా ఉత్సవాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎస్ కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జీవీ రమణ, ఎం. హనుమంతరావు, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, జిల్లా కోశాధికారి ఎండీ దౌలా, కార్యదర్శులు రాజశేఖర్, సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా 'మద్యం' లాటరీ ప్రక్రియ

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్



ప్రత్తిపాడులో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎ.నిశాంత్‌కుమార్

ప్రత్తిపాడు: సిండికేట్‌కు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ, లాటరీ ప్రక్రియ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఎ. నిశాంత్ కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషనులో ఏర్పాటు చేసిన మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని గురువారం సాయంత్రం కమిషనర్ పరిశీలించారు. వివరాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రమంతటా దరఖాస్తుల స్వీకరణ సక్రమంగా సాగుతోందన్నారు. ఆన్‌లైన్, హైబ్రిడ్, ఎక్సైజ్ స్టేషనులో దరఖాస్తుకు అవకాశం ఇచ్చామని తెలిపారు. లాటరీ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. లాటరీలో ఎంపికైన వారికే షాపు దక్కుతుందని చెప్పారు. సిండికేట్‌కి తావు లేదని చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్, డీపీఈవో వి.అరుణకుమారి, ఏఈఎస్ ఎం. మరియబాబు, ప్రత్తిపాడు సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లేక కార్మికులకు ఉపాధి కరువు

- ఉచితంగా ఇస్తామని చెప్పిన చంద్రబాబు మాట తప్పారు
- సీఎం తీరుపై సీఐటీయూ నాయకుల మండిపాటు



రథంబజార్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

బాపట్ల టౌన్: ఇసుక లేక కార్మికులకు ఉపాధి కరువైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ తెలిపారు. గురువారం బాపట్లలోని రథం బజార్‌లో సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. సీహెచ్. మజుందార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక ఇస్తామని ఎన్నికలకు ముందు ప్రకటన చేశారని గుర్తుచేశారు. కానీ ఆచరణలో దానిని అమలు చేయలేదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం బాపట్లలో ట్రక్కు ఇసుక రూ. 7,200కు కొనుగోలు చేయాల్సి రావడం దారుణమన్నారు. ఇసుక లేక భవన నిర్మాణాలు ఆగిపోయి కూలీలు ఉపాధి కోల్పోవాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుకను సరఫరా చేయాలన్నారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా నడపాలన్నారు. కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు పోలి రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.